క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



ఖానాపురం: మండలంలోని మంగళవారిపేట గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు గుగులోతు సుధాకర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన ఇటీవల కాకతీయ మహానంది పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంజుల మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే కళారంగంలో సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కీర్య, రమేశ్, రాజు, శ్రీను, రాజు, సురేందర్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ఆల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ



వర్ధన్నపేట: వర్ధన్నపేటలోని ఆల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారని ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి చెప్పారు. ఓరుగల్లు డ్రాగన్ స్కూల్ ఆఫ్ జపాన్ కరాటే షోటాకాన్ ఆధ్వర్యంలో ఈనెల 17న కాజీపేటలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొనగా ఆల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు చందనశ్రీ, మిధున, తరుణ్, శ్రీహాన్, వరుణ్ బంగారు పతకాలు సాధించగా వరుణ్, శివమణి, నిదిలానేహా, సూర్యతేజ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ



సంగెం: మండలంలోని ఆశాలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిట్టల సదయ్య అదే గ్రామంలోని 656 కుటుంబాలకు సోమవారం రూ.3.50 లక్షల విలువైన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సదయ్య మీడియాతో మాట్లాడారు. తన సంపాదన నుంచి కొంత కేటాయిస్తూ స్వగ్రామ ప్రజలకు సేవలు అందించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లె బోయిన కిశోర్‌యాదవ్, ఉపసర్పంచ్ బోనాల పద్మ రమేశ్, నాయకులు పిట్టల సాంబయ్య, పకిడ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు



వర్ధన్నపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, వర్ధన్నపేట ఎమ్మెల్యేగా కేఆర్.నాగరాజు గెలవాలని కోరుకున్న క్రమంలో మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మోర సుదర్శన్ ఇల్లంద శివారులోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించాడు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుదర్శన్ మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు ప్రజలకు అండగా నిలవాలని, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

సర్పంచ్, ఎంపీటీసీ పదవులు రిజర్వ్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న రమేశ్

సంగెం: మండలంలోని మొండ్రాయి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ పదవులను స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎస్సీలకు రిజర్వ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతళ్ల రమేశ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి సోమవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పంచాయతీ ఏర్పడిన నాటి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ పదవులు ఎస్సీకి రిజర్వ్ కాలేదన్నారు. కులగణన, దామాశ ప్రకారం గ్రామంలో ఎస్సీల సంఖ్య అధికంగా ఉన్నా ఇప్పటివరకు ఎస్సీలకు రిజర్వ్ చేయలేదని వివరించారు. రానున్న ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ పదవులను ఎస్సీకి రిజర్వ్ చేసి సమన్యాయం పాటించాలని రమేశ్ ఆకాంక్షించారు.

వేడుకగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



నెక్కొండ : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గీసుకొండ: మండలంలోని ఊకల్ హవేలిలోని నాగేంద్రస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం సోమవారం కనుల పండువగా జరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని తిలకించారు. వధువులు వల్లీదేవి, దేవసేనదేవితో స్వామి వారి కల్యాణం జరిపించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. పలువురు దంపతులు ఉత్సవాల్లో పాల్గొని తన్మయత్వం చెందారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు జైజై నాగేంద్ర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అంటూ పారవశ్యంతో నినాదాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబూరావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, దేవులపెల్లి ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో..

నెక్కొండ: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం మండలవ్యాప్తంగా ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని శ్రీరాలింగేశ్వర ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్టుకు పంచామృత సహిత విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు బీవీఎస్.శాస్త్రీ ఆధ్వర్యంలో వేద పండితులు బూర్గుపల్లి శ్రవణ్‌శాస్త్రీ, అనుముల గోపాలకృష్ణమూర్తి, డింగరి శేష పవన్‌కుమార్ కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివాహ ప్రతిబంధకాలు తొలగాలని, శీఘ్రంగా వివాహం జరగాలని, సత్సంతాన సిద్ధి కలగాలని కోరుతూ పలువురు భక్తులు ముడుపు కట్టారని చెప్పారు. గతంలో కోరికలు నెరవేర్చిన స్వామికి కొందరు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. కల్యాణానికి భారీగా భక్తులు తరలివచ్చి తిలకించారు.



గీసుకొండ : ఊకల్‌లో స్వామి,అమ్మవార్లు



గీసుకొండ: తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

ఘనంగా 'అమ్మ, నాన్న, గురువు' వేడుకలు



పద్యాలను ఆలపిస్తున్న విద్యార్థినులు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో అమ్మ, నాన్న, గురువు పద్యార్చన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, గురువు శతకాల్లోని పద్యాలను కంఠస్థం చేసి 167 మంది సామూహిక గానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) జ్యోతి మాట్లాడారు. తానాతోపాటు సుమారు 100 దేశాల్లో ఉన్న వందకుపైగా తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమాతరమ్ పేరుతో చిగురుమళ్ల శ్రీనివాస్ 100 దేశాల్లో నిర్వహిస్తున్న శాంతి సద్భావన యాత్రలో భాగంగా అమ్మ, నాన్న, గురువు శతక పద్యార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయురాలు తేజస్విని మాట్లాడారు. విద్యార్థుల్లో పెద్దల పట్ల గౌరవభావాన్ని పెంచేలా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజస్విని, రాజ్యలక్ష్మి, రజిత, రజిని, షాహీనా, పల్లవి, సుమ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు అభినందనలు



పర్వతగిరి: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును మండల నాయకులు హనుమకొండలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. తొలుత నాగరాజుకు నాయకులు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ గోపనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మిట్టపల్లి నాగార్జున, సీనియర్ నాయకులు మహబూబ్‌పాషా, బాధ నర్సింగరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద రవీందర్, ఉపాధ్యక్షుడు బెల్లం రాజు, బీసీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బెల్లం కుమార్, కిరణ్, నాంపల్లి భిక్షపతి, యాదగిరి, వర్కాల స్వామి, ఆకుల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదికను వినియోగించుకోవాలి

రాయపర్తి: నేడు (మంగళవారం) మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను వినియోగించుకోవాలని ఎంపీడీఓ గుగులోతు కిషన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో 2021 నవంబర్ నుంచి 2023 మార్చి వరకు ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ప్రజలు ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ప్రజావేదికలో పాల్గొనాలని కోరారు.

చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పట్టణంలోని పాకాల్ రోడ్డుకు చెందిన రైస్ మిల్ కార్మికుడు తాళ్ల చంద్రశేఖర్ ఇటీవల ప్రమాదానికి గురికాగా ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. ఆయన ములుగు జిల్లా జంగాలపల్లిలోని రైస్ మిల్లులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 6న పని ముగించుకుని రాత్రి ఇంటికి వస్తుండగా ఇటుకాలపల్లి శివారులోని నర్సింగాపురం క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఐనవోలు: సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, పున్నేలు సర్పంచ్ కత్తి దేవేందర్ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగరాజుకు నాయకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట : నివాళులర్పిస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి



సంగెం : నివాళులర్పిస్తున్న చల్లా ధర్మారెడ్డి



చెన్నారావుపేట : నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : నర్సంపేటకు చెందిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ గద్దల అశోక్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా అతడి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని కిషన్, కౌన్సిలర్ దార్ల రమాదేవి, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..

సంగెం: మండలంలోని కాట్రపల్లి సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూలుగు సాగర్‌రెడ్డి నాయినమ్మ ఆగమ్మ ఆదివారం రాత్రి మృతి చెందగా ఆమె మృతదేహానికి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సారెస్పీ కాల్వలో పడి ఇటీవల మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ చింతిరెడ్డి తిరుపతిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, నాయకులు బిల్లా రమణారెడ్డి, చింతం సదానందం, మేరుగు వీరేశం, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి..

చెన్నారావుపేట: మండలంలోని చెరువుకొమ్ము తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు భూక్య ఈర్య మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూక్య రాందాస్, ఎంపీటీసీ, జిల్లా మహిళ కాంగ్రెస్ కార్యదర్శి రమాబాయి, నాయకులు మైబుసింగ్ రాథోడ్, నర్సునాయక్, మోహన్‌నాయక్, రమేశ్, భిక్షపతి, వస్రాం, అరుణ పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర: బీఆర్‌ఎస్ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఏఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో తనకోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక, పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేశానని అన్నారు. ఇకపై నిత్యం నియోజవర్గ ప్రజల సమస్యలపై పోరాటం చేసి, సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షుడు గండు రాము, చంద్రమౌళి, మడికొండ శ్రీను, రాజ్‌కుమార్, సంజీవరెడ్డి, సారంగపాణి, ఎంపీపీలు శంకర్, కళావతి, జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతం సదానందం, దామెర, పరకాల, నడికూడ, ఆత్మకూరు, గీసుకొండ, సంగెం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ.. రూ.3,091 రికవరీ



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న శ్రీనివాస్

ఐనవోలు: మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై అధికారులు తనిఖీ నిర్వహించారు. మొత్తం రూ.1.55 కోట్ల పనులు జరుగగా ఈనెల 7 నుంచి 17 వ తేదీ వరకు గ్రామాల్లో అధికారులు తనిఖీ చేపట్టి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ ఆఫీసర్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కూలీలకు పనులు కల్పించి, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోజుకూలి రూ.272 గిట్టుబాటయ్యేలా ప్లాన్ చేయాలని సూచించారు. మండలంలో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. పంచాయతీ కార్యదర్శులకు రూ.1694, టెక్నికల్ అసిస్టెంట్ నీరజకు రూ.994, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య కు రూ.403 జరిమానా విధించారు. మొత్తం రూ.3091 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా వేదికలో మార్నేని మధుమతి, ఎంపీడీఓ వెంకటరమణ, విజిలెన్స్ అధికారులు నర్సింహారెడ్డి, సాగరిక, అంబుడ్స్‌మన్ నాగరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఏపీఓ నక్క కుమారస్వామి, ఆడిట్ టీమ్ మేనేజర్ వేణు, ఈసీ, టీఏలు, సర్పంచ్‌లు, ఎస్‌ఆర్‌పీలు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను పొందాలి

శాయంపేట : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను పొందినప్పుడే భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతారని విశ్వాని ఫౌండేషన్ ట్రైనర్ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ప్రతిభ, పాఠాలపై నిర్వహించే కౌన్సిలింగ్ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులు చూపిన దారిలో విద్యార్థులు నడవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించిన తరగతులను శ్రద్ధగా పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. విజయం సాధించడానికి ఏడు సూత్రాలను అపజయం పొందడానికి ఐదు సూత్రాలను బోధించారు. శ్రీమత్స్యగిరిస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఫౌండేషన్‌కు విరాళాన్ని అందించారు. అనంతరం ట్రైనర్ ఆంజనేయులును పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మామిడి పృథ్వి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



మెట్లపై పూజ చేస్తున్న అర్చకులు

నర్సంపేట : నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో 23వ మండల పూజా మహోత్సవం, మహా అన్నదాన కార్యక్రమం ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో సోమవారం కొనసాగాయి. దివ్య పడిపూజ దాతగా సైఫా సురేశ్ వ్యవహరించగా ఆలయ అర్చకులు దేవిశ్ మిశ్రా అభిషేక, 18 పడి మెట్లపై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భానోతు వెంకన్న శ్రీలత, దుప్పటి శ్రీలత, గుండు బాజ్జిలు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మాలధారులకు, భక్తులకు, అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, వంగేటి గోవర్ధన్, దోమకుంట్ల సదానందం, భూపతి లక్ష్మినారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, పాలకుర్తి శ్రీనివాస్, పిన్న రామనాథం, చిలువేరు వెంకటరాజ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కొమ్మాల' ఆలయాన్ని అభివృద్ధి చేయండి



గీసుకొండ: మంత్రి సురేఖతో అర్చకులు, నాయకులు



సంగెం : కొండా సురేఖతో నాయకులు

- మంత్రి కొండా సురేఖకు వినతి

గీసుకొండ: మండలంలోని సుప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీ నృసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ అర్చకులు కాండూరి రామాచార్యులు, కాంగ్రెస్ నాయకులు సాయిలి ప్రభాకర్, కొమ్మాల ఎంపీటీసీ వాంకుడోతు గోపాల్ కోరారు. ఈ మేరకు రామాచార్యులు, ప్రభాకర్, గోపాల్ హైదరాబాద్‌లో మంత్రి సురేఖను సోమవారం కలిసి మాట్లాడారు. మార్చిలో జాతర జరగనున్న క్రమంలో ఆలయ అభివృద్ధికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాలని కోరారు. జాతర నేపథ్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముదిగొండ శ్రీనివాస్, రాఘవేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖను కలిసిన నాయకులు

సంగెం: రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళ విభాగం మండల అధ్యక్షురాలు సంధ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, సర్పంచ్ ఇండ్ల రవికుమార్, ఉపసర్పంచ్ బండి రాధిక, నాయకులు జనగాం రమేశ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



దుగ్గొండి: శివాని

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ఎస్.శివాని రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భద్రమ్మ తెలిపారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివానీని పీఈటీ వీరగోని స్వప్న, సర్పంచ్ చుక్క రమేశ్, విద్యా కమిటీ చైర్మన్ జగదీశ్వర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. శివానీ ఇటీవల ధర్మారం హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. శివానీ ఈనెల 20 నుంచి 22 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



రాయపర్తి : విద్యార్థులతో పీఈటీ సమ్మయ్య

రాయపర్తి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పీఈటీ పుట్ట సమ్మయ్య తెలిపారు. ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో నారాయణపేట జిల్లాలో అండర్–14 విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిపినట్లు తెలిపారు. 8, 9వ తరగతుల విద్యార్థులు సీహెచ్.జగదీశ్, ఎండీ.రవూఫ్, ఎల్.చరణ్ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. పాఠశాల కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడింపజేస్తున్నారంటూ విద్యార్థులను, పీఈటీ పుట్ట సమ్మయ్యను ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగయ్య, సర్పంచ్ జోనగిరి ఎల్లయ్య, హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ గుమ్మడి రాజు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఖానాపురం: ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లోని మోడల్ స్కూళ్లలో తాత్కాలిక ప్రాతిపదికన సహాయక వంట మనిషి, హెడ్ కుక్‌గా పని చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన మహిళలు ఎమ్మార్సీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల కోరారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. సహాయక వంట మనిషి కోసం 7, హెడ్ కుక్ కోసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన స్థానిక మండలాల మహిళలు అర్హులని తెలిపారు. విద్య, స్థానికత, ఇతర గుర్తింపు వివరాలతో ఈనెల 22లోపు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

దామెర: జాతీయ ఉపాధి హామీ పనులను కూలీలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ కోరారు. మండలంలోని ఊరుగొండ, దమ్మన్నపేట గ్రామాల్లోని చేపడుతున్న ఉపాధి పనులను, నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలని చెప్పారు. ఈజీఎస్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, కూలీల వివరాలు సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శారద, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు తదితరులు ఉన్నారు.